## పోచంపల్లిలో ప్రజా దర్బార్



పోచంపల్లిలో ప్రజా దర్బార్‌లో ధరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

**చౌటకూరు, జనవరి 6, ప్రభాతవార్త:** మండలంలోని పోచంపల్లి గ్రామంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు అందచేసిన ధరఖాస్తులను తహసీల్దార్ ఈశ్వర్ రాణి స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిఓ శ్రీకాంత్‌గౌడ్, ఏఈఓ చైతన్య, ఎస్టీ సెల్ అధ్యక్షులు, గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అవినీతి,అప్పులు పెరిగాయి

- -తెలంగాణలో భవనాలు పెరిగాయి.. నియామకాలకు నోచుకోలేదు
- -ఆరోగ్యశ్రీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం జీవం పోసింది
- -పదేండ్ల పాలనలో నీళ్లు, నిధులు ఉత్తమాటలే అయ్యాయి
- -ఆరు గ్యారెంటీ పథకాలను అందజేయడమే కాంగ్రెస్ లక్ష్యం
- -వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ



ప్రజల నుండి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి6 ప్రభాతవార్త:**
పదేండ్ల తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణకు అవినీతితో పాటు అప్పులను తెచ్చిందని, ఈ రాష్ట్ర ప్రజలకు కావాల్సిన నీళ్లు, నిధులు, నియామకాలు ఉత్తమాటలుగానే నిలిచాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అభయహస్తం ఆరు గ్యారెంటీల పథకం ప్రజా పాలనలో చివరి రోజు భాగంగా మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి మెదక్ శాసన సభ్యులు డా. మైనంపల్లి రోహిత్‌తో పాటు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రానికి ఒరగబెట్టిందేమి లేదన్నారు. ఏ ఊరు వెళ్లినా ఇండ్లు, స్థలాల కోసం దరఖాస్తులు తప్పా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల కోసం స్థలాలు ఇచ్చిన పాపాన పోలేదని వమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చరిత్ర ఉందని ఆయన అన్నారు. తెలంగాణలో ప్రజలు పదేండ్ల బీఆర్ఎస్ పాలనను చూసి మార్పు కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తీర్పు ఇచ్చారని అన్నారు. మెడికల్ కళాశాలల భవనాలు ఏర్పాటు కావడం తప్ప అందులో నియామకాలు జరగలేదని ఆయన ఎద్దేవా చేశారు. విద్య, వైద్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అడిషనల్ కలెక్టర్ రమేష్, మెదక్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, ప్రజా పాలన స్పెషల్ అధికారి జయరాజ్, డీపీఆర్‌వో ఏడుకొండలు, మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ జానకిరామ్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ తొడుపూరి చంద్రపాల్, కౌన్సిలర్లు ఆర్‌కె. శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాయవాది జీవన్‌రావు, బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు, గూడూరి కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్, సుప్రభాతరావు, శ్రీనివాస్‌చౌదరి, పరశురాం, హాఫీజ్ మోల్సాబ్, సలీం, గోదల జ్యోతి, కృష్ణ, హరిత, రితీష్, కీర్తి, బట్టి సులోచన, అడిగాస్ రవీందర్ కౌన్సిలర్లు అవారి శేఖర్, దాయర లింగం, ఆవుల గోపాల్‌రెడ్డిల, మున్సిపల్ ఆర్‌పీలతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం : మంత్రి పొన్నం

- -గౌరవెళ్లి భూ నిర్వాపితుల విషయంలో ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యను పరిష్కారిస్తాం
- -హుస్నాబాద్ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం
- -డబుల్‌బెడ్‌రూం మరమ్మత్తులు చేసి అర్హిదారులకు అందచేస్తాం
- -ఆర్‌టిసి విషయంలో సమస్యలు లేకుండా చూస్తాం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్,జనవరి6,ప్రభాతవార్త**
తెలంగాణ ఆవిర్భావించాక ఇక్కడ ఇప్పటిదాకా ఏలిన ప్రభుత్వం తమ ఇష్టారాజ్యంగా మితిమీరిన వ్యయంతో అక్కరకురాని ఖర్చులు పెట్టి.. ఇపుడు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై భారం మోపిందని అయినా కూడా ప్రజలకోసం తాము వెరవకుండా ఖచ్చితమైన ప్రణాళికతో అభివృద్ధి పథంవైపు దూసుకెళతామని రాష్ట్ర రవాణాశాఖ,బిసిసంక్షేమశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వ్యాఖ్యానించారు.శనివారం నాడు హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన చివరిరోజు కార్యక్రమంలో హాజరై ప్రజల నుండి దరాఖాస్తులను అందుకున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి విషయంలో పలు వ్యాఖ్యలు చేశారు.ఇందులో ప్రధానంగా ఈ ప్రాంత కరవురైతాంగం కోసం తలపెట్టిన గౌరవెళ్ళి ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అప్పటి ప్రభుత్వం కనికరం లేకుండా నిర్వాపితులను దైర్జన్యకరంగా హింసించి చావుదెబ్బలతో బయటకు ఈడ్చారని మా ప్రభుత్వం అలా కాదని చెబుతూ సమాజానికి ఉపయోగపడే పెద్దలతో చర్చించి వారి సూచనల మేరకు ప్రజాస్వామ్యబద్ధంగా భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా సమస్యను పరిష్కరిస్తామని వారికి అభయమిచ్చారు. అలాగే హుస్నాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలోనూ తమ ప్రభుత్వానికి చిత్తశుద్ది ఉందని ఈ విషయంలో సిడిఎంఏ బృందం హుస్నాబాద్‌కు పర్యటించి పరిశీలన చేయడం జరిగిందని చెప్పారు.దీని విషయంలో ఇప్పటికే రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో పాటు నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించడం జరిగిందని పొన్నం ప్రభాకర్ వివరించారు.గౌరవెళ్ళి ప్రాజెక్టు విషయంలో ఇంకా 2000 వేల ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని ఇది పూర్తయిన అనంతరం డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌ను నిర్మించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం దేవాదుల,శ్రీరాంసాగర్,వరదకాలు వ ఫేజ్ 2ద్వార నీరు పంపిణీ జరిగేలా ప్రభుత్వం చర్యల తీసుకుంటుందని వివరించారు.తాను ఇక్కడ హుస్నాబాద్ వరకే మంత్రి బాధ్యతలు కాకుండా హైదరాబాద్‌లో సైతం 150డివిజన్లకు మంత్రి బాధ్యతలున్నాయని హుస్నాబాద్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధికి పాటుపడతానని పొన్నం ప్రభాకర్ స్పష్టత నిచ్చారు.ప్రజాస్వామ్య పునరుద్ధరణలో భాగంగా తాము హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌ను ఏర్పాటు చేయడం జరిగిదంని చెప్పారు. పట్టణంలోని హమాలీ కార్మికులు హెల్త్‌ప్రొఫైల్ పరీక్షలు చేయించకుంటే వారికి అవసరమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు.విద్య, వైద్యం,గృహవసతి,ఉద్యోగలు,సామాన్యప్రజలురైతులు తదితర అ్దరికి సమస్యలు లేకుండా చూసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఇదే కాకుండా రవాణా విషయంలో హుస్నాబాద్ ప్రాంతంలో ఏ ప్రాంతానికైనా బస్ సౌకర్యం కావాలని ఉంటే వారు తన దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కారం చేస్తానని మాట ఇచ్చారు. హుస్నాబాద్ బస్‌డిపోను బలోపేతంగా తీర్చిదిద్దడం తన ముందున్న ప్రధాన కర్తవ్యమని పొన్నం ప్రభాకర్ అన్నారు.హుస్నాబాద్ ప్రజలు ఎక్కడికి వెళ్ళినా అక్కడ వారికి గౌరవప్రతిష్టలు పెంచేలా తన పనితనం ఉంటుందని వారు కించపరిచే విధంగా తాను ఉండబోనని హుస్నాబాద్ ప్రజలను పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా పాలన కార్యక్రమం ద్వార ప్రజలనుండి 85వేల దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో పాటు హుస్నాబాద్ రెవెన్యూడివిజనల్ అధికారి బెన్ షాలోం,తహశీల్ధార్ రవిందర్‌రెడ్డి,హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్,హుస్నాబాద్ మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న,కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిత్తారి పద్మరవిందర్,వైస్‌చైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి,హుస్నాబాద్ సింగిల్‌విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య,డిసిసి మెంబర్ కేడం లింగమూర్తి,కౌన్సిలర్లు భూక్య సరోజన,వల్లపు రాజు,పున్న లావణ్యసది,దొడ్డి శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, కోఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి,ఎండి అయూబ్,సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి,మైదంశెట్టి వీరన్న,పెరమండ్ల నర్సా గౌడ్,గొర్ల ఐలేష్‌యాదవ్,వెన్న రాజు,బూరుగు కిష్టస్వామి,కూన విశ్వతేజతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**కోహెడ మండలంలో...**

**కోహెడ, జనవరి 6, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శనివారం కోహెడకు విచ్చేసిన మంత్రికి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న మంత్రి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినటువంటి అరు గ్యారెంటీల సంక్షేమ పథకాలను అమలు పరుస్తామన్నారు. మొదట దశగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో పాటు రాజీవ్ అరోగ్యశ్రీ కింద రూ.10 లక్షలు అమలు చేయడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక అర్థం, పర్థం లేకుండా తప్పుడు అరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంద ధర్మయ్య, నాయకులు బస్వరాజు శంకర్, శెట్టి సుధాకర్, బందెల బాలకిషన్, మోహన్‌రెడ్డి, వేల్పుల వెంకటస్వామి, చింతకింది శంకర్, దొమ్మాట జగన్‌రెడ్డి, గూడ స్వామి, అన్ని గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, కార్యదర్శులు,పాల్గొన్నారు.

## ప్రజల సేవ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

**-జిల్లా నూతన ఎస్పీ బాలస్వామి**



ఎస్పీ బాలస్వామికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న అదనపు ఎస్పీ మహేందర్

**మెదక్ అర్బన్, జనవరి6 ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం జిల్లా నూతన ఎస్పీగా వచ్చిన బాలస్వామికి జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన ఎస్పీ బాలస్వామిని మెదకన సబ్ డివిజన్ డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ సబ్ డివిజన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ ఎస్ఆర్. సుభాష్‌చంద్రబోస్, ఏఆర్ డీఎస్పీ రంగనాయక్, జిల్లా సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, డీపీవో సిబ్బంది కలవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ నరపజల సేవ కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా తనను నేరుగా కలవవచ్చుని అన్నారు. అలాగే జిల్లాలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే మానుకోవాలని, లేదంటే అట్టి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయన్నారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు, అక్రమ కార్యకలాపాలు, రోడ్డు ప్రమాదాలు మొదలైన వాటిపై దృష్టి పెడతామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలను ప్రతి ఒక్కరినీ మర్యాదపూర్వకంగా ఆహ్వానించి తగు సేలు అందించడంలో ముందుండాలని, పోలీస్ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కలిగేలా విధులు నిర్వర్తించాలని, బాధితులతో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా తెలిపారు

## నిర్ణీత గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలి

**-అదనపు కలెక్టర్ మాధురి**




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మాధురి

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 6, ప్రభాతవార్త:**
నిర్ణీత గడవులోగా సీఎంఆర్ ఇవ్వాలని అధనపు కలెక్టర్ మాధురి అధికారులకు సూచించారు. శనివారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సివిల్ సప్లై అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమావేశం అయి గత వానాకాలం, యాసంగి (2022-23)కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ రైస్ మిల్లర్లు పెట్టవలసిన కస్టమ్ మిల్లింగ్ రైస్ దిగుమతిలో ఎఫ్‌సిఐ సివిల్ సప్లయ్‌కి సంబంధించి సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు. 2023-24 ధాన్యం రవాణాకు సంబంధించి రసీదులను త్వరిత గతితన సమర్పిస్తే డబ్బులు చెల్లించడం జరుగుతుందని ధాన్యం రవాణా కాంట్రాక్టర్‌లకు సూచించారు. సమావేశంలో డిఎస్ఓ వనజాత, సివిల్ సప్లై డిఎం సుగుణబాయ్, రైస్ మిల్లర్లు, ధాన్యం రవాణ కాంట్రాక్టర్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

# నేడే కోరమీసాల మల్లికార్జునస్వామి కల్యాణం

- -ముస్తాబైన కొమురవెళ్లి మల్లన్న ఆలయం
- -భక్తుల సౌకర్యార్థం భారీ ఏర్పాట్లు
- -పటష్టమైన పోలీసు బందోబస్తు

**కొమురవెళ్ళి, జనవరి 6, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ కొమురవెళ్ళి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, అలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 7న అదివారం 10.45 నిమిషాలకు దేవాలయం ఆవణలో తోట బావి వద్ద స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. మల్లన్న కల్యాణం జరుగనుండడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని వీక్షించడానికి సుమారు మూడెకరాల స్థలంలో కల్యాణ వేదికతోపాటు భక్తుల సౌకర్యార్థం చలవ పందిళ్ళను ఏర్పాటు చేశారు. కల్యాణానికి రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. కల్యాణానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హాజరు కానున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వహకులు నిమగ్నమయ్యారు. గర్భాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను 30 కిలోలతో తయారు చేసిన వెండి సింహాసనంపై ఊరేగింపుగా కల్యాణ వేదిక అయిన తోట బావి వద్దకు తీసుకొస్తారు. కల్యాణంలో స్వామి వారి తరపున పడిగన్నగారి వంశస్తులు, అమ్మవార్ల తరపున మహాదేవుని వంశస్తులు పాల్గొంటారు. కార్యక్రమానికి ప్రభుత్వం తరపున మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించనున్నారు. భక్తుల కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. అలయ పునరుద్ధరణ కమిటీ పాలక మండలి చైర్మన్ లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు, ఈవో బాలాజీతో పాటు ఏఈఓ వైరాగ్యం అంజయ్య, సూపరిటెండెంట్ నీల శేఖర్, అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ స్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు.



: విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న మల్లన్న సా ్వమి గోపురం

**పటిష్టమైన బందోబస్తు**

మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణం ఈనెల 7న నిర్వహిస్తుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ అధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు. బందోబస్తును సెక్టార్లుగా విభజించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు రాకుండ ట్రాఫిక్ స్థలాలను ఏర్పాటు చేశారు. చీమ చిట్టుకుమన్న పట్టుకోవడానికి 80 సీసీ కెమోరాలు ఏర్పాటు చేశారు.దేవాలయం ఆవరణలో సీసీ కెమోరాలతో పట్టిమైన నిఘా ఏర్పాటు చేశారు. 300 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో తగు ఏర్పాట్లు చేశారు.

**పర్యవేక్షణకు పీఠాధిపతి**



అలయంలోని స్వామి వారు

శ్రీ మల్లికార్జున స్వామి వార్షిక కళ్యాణోత్సవం సందర్భంగా ఉజ్జయిని పీఠాధిపతులు శ్రీ 1008 జగద్గురు సిదలింగరాజదేశీ కేంద్ర శివాచార్య మహా స్వామీజీ కొమురవెల్లి దేవాలయానికి చేరుకున్నారు. ఆదివారం వేకువజామున ఆలయవర్గాలు నిర్వహించే దృష్టికుంభాల కార్యక్రమంలో స్వామిజీ పాల్గొనడంతో పాటు మల్లికార్జున స్వామి వారి తొలి దర్శనాన్ని చేసుకోనున్నారు. అనంతరం ఉదయం 10.45 గంటలకు ప్రారంభమయ్యే కల్యాణోత్సవాన్ని పర్యవేక్షిస్తారు.

## రైతులు లాభాలు వచ్చే పంటలను సాగుచేయాలి



డ్రాగన్ పండ్ల తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి

**మర్కుక్, జనవరి 6 (ప్రభాతవార్త):**
రైతులు లాభాలు వచ్చే పంటలను సాగుచేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వ్యవసాయ విస్తరణాధికారి విష్ణువర్ధన్ అన్నారు. శనివారం మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో ఓ రైతు సాగు చేస్తున్న డ్రాగన్ పండ్ల తోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేవలం సాంప్రదాయ పంటలు అయినటువంటి వరి, మొక్కజొన్న, పత్తి పంటలే కాకుండా అధిక లాభాలు వచ్చే డ్రాగన్ ఫ్రూట్, ఎండు మిరప, బొప్పాయి, స్వీట్‌కార్న్, పందిరి కూరగాయలను ఎత్తయిన బెడ్లు వేసుకొని మల్చింగ్ షీటు మరియు డ్రిప్ ద్వారా సాగు చేయాలని రైతులకు సూచించారు. మనకు వంటిమామిడి కూరగాయల మార్కెట్ అందుబాటులో ఉంది కాబట్టి మంచి లాభాలు రావడానికి అవకాశం ఉందని రైతులకు సూచించారు. రైతులు వరి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేయడం వల్ల ఆశించిన మేరకు లాభాలు రావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు

**నూతన తహసీల్దార్‌గా మన్నన్**

**చిన్నశంకరంపేట,జనవరి 6,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండల నూతన తహసీల్దార్‌గా ఎమ్ఎ మన్నన్ శనివారం నాడు బాధ్యతలు చేపట్టారు. మెదక్ ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటర్ అధికారిగా విదులు నిర్వహించి, పదోన్నతిపై ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ చంద్రశేఖర్ మనోరాబాద్ మండలానికి బదలిపై వెళ్లిపోయారు. నూతన తహసీల్దార్ మన్నన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

## కలెక్టర్‌ను కలుసుకున్న ఎఐటిఎఫ్ నాయకులు

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:**
జిల్లా కలెక్టర్‌గా బాధ్యలు స్వీకరించిన వల్లూరి క్రాంతిని శనివారం ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం రాష్ట్ర కమిటి బృంధం సభ్యులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్‌కు పూల బొకేను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్య, వైద్యంపై కలెక్టర్‌తో చర్చించినట్లు ఎఐటిఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వనియ్‌పవార్, కార్యదర్శి రవి రాథోడ్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు గోవింద్ రాథోడ్‌లు, రవి పవర్‌లు తెలిపారు.



కలెక్టర్ వల్లూరి క్రాంతిని కలుసుకున్న ఎఐటిఎఫ్ నాయకులు

## ముగిసిన ప్రజా పాలన కార్యక్రమం

**చిన్నశంకరంపేట,జనవరి 6,ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. మండల వ్యాప్తంగా 14వేల 635 దరఖాస్తులు రాగా అందులో ప్రభుత్వ పథకాలకు 11వేల481 దరఖాస్తులు చేసుకోగా, ఇతర పథకాలకు 3154 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచి రాజిరెడ్డి, తహసీల్ధార్ చంద్రశేఖర్, ఎపీఎమ్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి లక్ష్మి ప్రవీణ్, ఎంపీవో గిరిధర్‌రెడ్డి,పీఆర్ఎఈ విజయ్, పంచాయతీ ఈవో సంతోష్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్

## ట్రాన్స్‌జెండర్ హత్య కేసులో ముగ్గురు వ్యక్తుల రిమాండ్

**సిద్దిపేట రూరల్, జనవరి 6, ప్రభాతవార్త :**
ట్రాన్స్‌జెండర్ హత్య కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. సీఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని బోయిగల్లికి చెందిన వేదశ్రీకి నాసర్‌పుర్‌కు చెందిన దరిపల్లి వెంకటేష్‌తో 2014లో వివాహం జరిగిందన్నారు. 2015లో వారికి ఒక పాప జన్మించినట్లు తెలిపారు. అనంతరం వెంకటేష్ అదనపు కట్నం తీసుకురమ్మని వేధించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో వెంకటేష్ ట్రాన్స్‌జెండర్‌గా మారి చీర కట్టుకొని తిరుగుతూ వేదశ్రీ ఎక్కడ పని చేస్తే అక్కడికి వెళ్లి చప్పట్లు కొడుతూ అసభ్యంగా ప్రవరిస్తు వస్తున్నట్లు తెలిపారు. దీంతో వేదశ్రీ తన ఉద్యోగాలను పోగొట్టడంతో పాటు పరువు తీస్తున్నాడన్న కోపంతో తన అడ్డు ఎలాగైనా తొలగించుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. తనకు పరిచయం ఉన్న బోయిని రమేష్‌తో కలిసి కాకతీయ ఫుట్‌వేర్ షాప్ ఓనర్ రమేష్ రూ.18 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని అతనికి రూ. 4 లక్షల 60 వేలు అప్పగించినట్లు వివరించారు. పథకం ప్రకారం గత డిసెంబర్ 11న ఇప్పల శేఖర్ సహాయంతో వెంకటేష్ అలియాస్ రోజాకు బీర్ తాగించి నిద్రిస్తున్న సమయంలో మరో ఇద్దరు వ్యక్తుల సహాయంతో దిండుతో ముఖంపై ఒత్తి ఉపిరాడకుండా చేసి చంపినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్న క్రమంలో వెంకటేష్ అలియాస్ రోజాది హత్య కేసని తెలిందన్నారు. వెంకటేష్ అలియాస్ రోజా హత్యకు సుఫారి ఇచ్చిన వేదశ్రీతో పాటు హత్యకు సహకరించిన ఇప్పల శేఖర్, రమేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

## మంత్రి దామోదర రాజనరసింహకు సన్మానం



మంత్రి దామోదర రాజనరసింహను సన్మానిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నరేందర్

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి6 ప్రభాతవార్త:**
రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా శనివారం మెదక్‌కు విచ్చేసిన దామోదర రాజనరసింహను టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

**ఎమ్మెల్యేను కలిసి టీఎన్జీవోలు...**
మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును టీఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి మినికి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎక్బాల్ పాషా, ఫజులుద్దీన్, కార్యనిర్వాహక కార్యదర్శి చిరంజీవ ఆచార్యులు, మెదక్ యూనిట్ అధ్యక్షులు పంపరి శివాజీ, పంచా యతీ రాజ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు మాణిక్యాల చంద్రశేఖర్‌లు ఉన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి రద్దు చేయాలి

**-మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్**

**రామాయంపేట, జనవరి 6, ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఎస్‌టీయు మెదక్ జిల్లా క్యాలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు భారంగా మారిన ఎఫ్ఎల్ఎన్ మరియు ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలన్నారు. దీనివలన ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, రాష్ట్ర కార్యదర్శి రాజు, నిజాంపేట అధ్యక్షులు పరుశరామ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రామాయంపేట మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నర్సాగౌడ్, జిల్లా బాధ్యులు శివప్రసాద్, సత్యనారాయణ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**చిన్నశంకరంపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
మండల పరిధి రుద్రారంలో మెడిసిటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిభిరం శనివారం నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా పరిక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. అందులో 42 మందికి శస్త్ర చికిత్స అవసరం ఉందని, వారికి త్వరలో చికిత్స అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రుద్రారం సర్పంచి మంచాల లక్ష్మణ్, పాలకవర్గ సభ్యులు, డాక్టర్లు అర్పిత, ప్రియాంక, దివ్య రావ్, ఐశ్వర్య, మార్కెటింగ్ సంజయ్, రాజు, వీర్ కుమార్ పాల్గొన్నారు.

## సిపిఎస్‌ను రద్దు చేయాలి

**-ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య**



ఎస్టీయూ కాలమానిని విడుదల చేస్తున్న తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో ప్రవీణ్

**చిన్నశంకరంపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. శనివారం చిన్నశంకరంపేట పట్టణంలో తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో ప్రవిణ్‌తో కలిసి ఎస్టీయూ కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి జబ్బార్, మండల అధ్యక్షులు సిహెచ్ గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎండి జహిరోద్దిన్, ఎస్టీయూ జిల్లా బాధ్యులు, మండల బాధ్యులు రతన్, చంద్రం, శ్రీనివాస్, అనత, నరేష్, రవి, మహేశ్వర్, సురేష్, రామలింగం, రామచంద్రం, సునంద, వాణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వెలెనెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

**-మంత్రికి వినతిపత్రం అందజేసిన మెదక్ ప్రెస్ క్లబ్**

**మెదక్ అర్బన్, జనవరి6 ప్రభాతవార్త:**
జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మెదక్ జిల్లా కేంద్రంలో వెల్నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొంతి నరేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లాలో సుమారు 1000 మంది జర్నలిస్టులు, 5000 ప్రభుత్వ పెన్షన్ దారులు ఉన్నారని తెలిపారు. వీరికి వైద్య సేవలు అందించేందుకు మెదక్‌లో వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేస్తామని గత ప్రభుత్వ హయాంలో ఉన్న పాలకులు హామీ ఇచ్చి విస్మరించారని గుర్తు చేశారు. కావున మెదక్ జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి జర్నలిస్టులు, పెన్షన్‌దారులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహచారి, ప్రెస్ క్లబ్ బాధ్యులు కామాటి కృష్ణ, గోపాల్‌గౌడ్, రియాజ్, సంగమేశ్వర, వికాస్, హరినాథ్, సరేందర్‌రెడ్డి, బీవీకే రాజు, ప్రకాష్, నాగరాజు, వెంకట్‌గౌడ్, రాజాగౌడ్, లక్ష్మణ్, గోవర్ధన్, సందీప్, సిద్ధు, రమేష్, శ్రీకాంత్, నాగరాజు, యూసుఫ్, శేఖర్, కార్తీక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరేష

# ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు



వివేకానంద కాలనీలో ఇంటింటికీ అక్షింతల వితరణ చేస్తున్న దృశ్యం



ఇంటింటికి తిరుగుతూ అక్షింతలను పంచిపెడుతున్న శ్రీరామ కమిటీ సభ్యులు



చిన్నశంకరంపేటలో రాముల వారి అక్షింతలను ఊరెగిస్తున్న భక్తులు

**రామాయంపేట మున్సిపాలిటీలో**

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 6, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో అయోధ్య రాములోరి అక్షింతలు ఇంటింటికీ వితరణ కార్యక్రమం అంగరంగ వైభవంగ సాగింది. శనివారం నాడు మున్సిపాలిటీలోని 3వ, 5వ వార్డుల పరిధిలోని వెంకటేశ్వర కాలనీ, రైతుబజార్, వివేకానంద కాలనీలలో శ్రీరామ తీర్థ ట్రస్ట్‌వారి శ్రీ రాములవారి అయోధ్య అక్షింతల కలశానికి పూజలు నిర్వహించి ప్రతి ఇంటికి, గడపగడపకు మంగళవాయిధ్యాలతో, ఆధ్యాంతం జై శ్రీ రాం...జైజై శ్రీరాం నినాదాలతో తిరుగుతూ అక్షింతలను వితరణ చేశారు. అక్షింతల కలశానికి ప్రతి ఇంటివద్ద మంగళహారితితో స్వాగతం పలికారు. హిందువుల చిలకాల స్వప్నం రామ జన్మభూమి అయోధ్యలో రాముని ఆలయం ప్రారంభోత్సవం కావడం చాలా సంతోషంగా ఉందని, అయోధ్య రాముని అక్షింతలు ప్రతి ఇంటికి అందడం అదృష్టమని, పూర్వజన్మ సుకృతమని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఈనెల 22న అయోధ్యలో రాముని యొక్క ప్రాణప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా బాలరాముని ప్రాణ ప్రతిష్ట అనంతరం ప్రజలు తమ ఇళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించి అక్షింతలు తమ నెత్తిపై చల్లుకోవాలని శ్రీరామ కమిటీ సభ్యులు కోరారు. ఆరోజు ప్రతి ఇంటిలో 5 దీపాలు వెలిగించాలని ప్రచారకులు అన్నారు. ఈ కార్యక్రమంలో సుంకోజు దామోదర్, నవాత్ నవీన్, పి.బి. శ్రీశైలం, నవాత్ ప్రసాద్, నవాత్ మహేష్, మధునాల స్వామిగౌడ్ (ఎంఎస్), బచ్చు శ్రీనివాస్, భుజంగరెడ్డి, దోమకొండ చిన్న శ్రీనివాస్, అక్కన్నపేట శ్రీను, స్వామి, మున్నూరు రాములు, వంశీతో పాటు ఆయా కాలనీలకు చెందిన మహిళలు పెద్దఎత్తున్న పాల్గొన్నారు.

**నిజాంపేట మండలంలో**

**నిజాంపేట, జనవరి 6, ప్రభాతవార్త :** నిజాంపేట మండల కేంద్రంలో శనివారం శ్రీరామ జన్మభూమి అయోధ్య నుండి వచ్చిన అక్షింతల వితరణ కార్యక్రమాన్ని శ్రీరామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గడపగడపకు తిరుగుతూ అక్షింతలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశము మొత్తం అక్షింతలు పంచిపెట్టే కార్యక్రమం నిర్వహించారని, ఈ అక్షింతలను ఈనెల 22 బాలరాముని ప్రాణ ప్రతిష్ట అనంతరం ప్రజలు తమ ఇళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించి తమ నెత్తిపై చల్లుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ కమిటీ సభ్యులు గ్రామ పురోహితులు వేలేటి రామ్మోహన్ శర్మ, జిపి. స్వామి, తిరుపతి, నరేందర్, చంద్రశేఖర్, బట్ట మహేష్, చీకోటి వెంకటేశం, మాసుల నాగరాజు, కరుణాకర్, కృష్ణ, బండారి ప్రశాంత్, కుమార్, చంద్రకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేట పట్టణంలో..**

**చిన్నశంకరంపేట, జనవరి 6, ప్రభాతవార్త:** అయోధ్యలోని రామ మందిరం ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న నేపథ్యంలో చిన్నశంకరంపేట పట్టణంలో శ్రీరాముల వారి అక్షింతలకు శ్రీ సోమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి, ఘనంగా ఊరెగించారు. ఇంటింటికి అయోధ్య రాముని అక్షింతలను ఇంటింటికి మహిళలకు పంపిణి చేశారు. అలాగే మండల పరిధి కొర్విపల్లి గ్రామంలో అక్షింతలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోగుల రాజు, మంజూల, పూజారి శివప్రసాద్, రంగారవు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరం

**-ఎంఈఓ బుచ్యానాయక్**



నర్సాపూర్‌లోని డాన్‌బాస్కో పాఠశాలలో జరిగిన క్రీడాపోటీల్లో విజేతలైన విద్యార్థులను అబినందిస్తున్న ఎంఈఓ బుచ్యానాయక్, పాఠశాల ఎండి నర్సిరెడ్డి తదితరులు

**నర్సాపూర్, జనవరి 6. ప్రభాతవార్త:**
విద్యార్థులకు విద్య తో పాటు క్రీడలు కూడ ఎంతో అవసరమని మండల విద్యాధికారి బుచ్యానాయక్ అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని డాన్‌బాస్కో పాఠశాల వార్షికోత్సవంలో బాగంగా పాఠశాల అధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిద రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఈమేరకు ఆటల పోటీల్లో వజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎంఈవో బుచ్యానాయక్ అభినందించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డాన్‌బాస్కో పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల యాజమాన్యం క్రీడా దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు వివిద రకాల క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనెజింగ్ డైరక్టర్ నర్సిరెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

**రామాయంపేట, జనవరి 6, ప్రభాతవార్త :**
స్థానిక ఆర్యవైశ్య మహిళా సభ ఆధ్వర్యంలో రామాయంపేట పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగింది. ఇందులో గెలుపొందిని వారికి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి నాగమల్లి స్నేహ, రెండవ బహుమతి ఎర్రం అవంతి, మూడో బహుమతి తోట వందనలకు లభించింది. అంతేకాకుండా ముగ్గుల పోటీలో పాల్గొన్న సంఘ సభ్యులందరికీ బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షురాలు ఎనిశెట్టి శ్రీవాణి అశోక్, ప్రధాన కార్యదర్శి బొమ్మెర్ల లావణ్య, కోశాధికారి గుండు శ్యామల, పి.ఆర్.ఓ. కొండూరి మౌలిక, ఆర్యవైశ్య మహాసభ రామాయంపేట మండల అధ్యక్షురాలు సుధాం మల్లేశం, పట్టణ అధ్యక్షులు పబ్బ సత్యం, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేష్, వాసవిమాత అధ్యక్షులు గుండు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎనిశెట్టి అశోక్, కోశాధికారి ఎర్రం శ్రీనివాస్, చొల్లేటి సంతోష్, గౌరిశెట్టి చంద్రశేఖర్, కాసం సంతోష్, మహిళ సంఘం సభ్యులు అందరి ఆధ్వర్యంలో కార్యక్రమం దిగ్విజయం చేయడం జరిగింది.

## క్రీడలను ప్రోత్సహించేందుకే క్రికెట్ టోర్నమెంట్



విలేఖరులతో మాట్లాడుతున్న కిజర్ యాపై క్రికెట్ టోర్ని ప్రతినిధులు

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** క్రీడలను ప్రోత్సహించేందుకే జహీరాబాద్ పట్టణంలో కిజర్ యాపై అంతర్ రాష్ట్ర క్రికెట్ టౌర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు టోర్ని అధికార ప్రతినిధి మాజీ కౌన్సిలర్ రాములు నేత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాములు నేత, కార్యదర్శి ఉమర్ ఆహ్మత్‌లు మాట్లాడుతూ 7 నుంచి 18వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతుందన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌ను సీనియర్ సివిల్ జడ్జీ సూరి కృష్ణ ఆదివారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభిస్తారన్నారు. టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొంటున్నట్లు వివరించారు. సమావేశంలో టోర్నమెంట్ ప్రతినిధులు విజయ రాథోడ్, మక్సుద్ అలీ, జుబేర్, ఉమర్, ఫరూక్, ఎండి అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఝురాసంగం, జనవరి 6, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 7వ తారీఖున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సరళ పేర్కొన్నారు. జహీరాబాద్ 132 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, అందుకు వినియోగదారులు తమ వంతు సహకరించాలని ఏఈ సరళ వినతి చేశారు.

**న్యాల్‌కల్ మండలంలో**

**న్యాల్‌కల్, జనవరి 6, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంలోని 132 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా ఈ నెల 7వ తారీఖున మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విదునయత్ ఏఈ అర్జున్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అందుకు వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈ అర్జున్ విరించారు.

## సుభాష్ రోడ్డులో అయ్యప్ప పడిపూజ



సుభాష్‌రోడ్డులో అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప దీక్షాపరులు

**సదాశివపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
పట్టణంలోని సుభాష్‌రోడ్డులో గురుస్వామి రాపోలు దత్తు ఆధ్వర్యంలో కన్నె స్వాములు చందు స్వామి, విజయ్‌స్వామిలు శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భజనలు, కీర్తనలు చేస్తూ స్వామిని ఆరాధించారు. 18 మెట్ల పడిని దీపాలతో, రంగు రంగు పూలు, పండ్లతో అలంకరించి స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పడి పూజ కార్యక్రమానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## ప్రజా పాలనలో 14103 దరఖాస్తుల స్వీకరణ

**-ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి**

**న్యాల్‌కల్, జనవరి 6, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం అందించే 5 గ్యారంటీలలో లబ్దిపొందేందుకు మండలంలోని ఆయా గ్రామాల్లో డిసెంబరు 28వ తారీఖు నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల్లో 14వేల 103 మంది ధరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 16వేల 662 కుటుంబాలు ఉన్నాయని గుర్తు చేశారు. 6వ తేదీ వరకు ధరఖాస్తులు చేసుకోని వారు సోమవారం 8వ తేదీన గ్రామ పంచాయితీ కార్యదర్శులకు తమ ధరఖాస్తులు అందచేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుకునేందుకు కల్పించిన అవకాశాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి సూచించారు.

## కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి

**-స్వాగతం పలికిన బార్ అసోసియేషన్**



జిల్లా జడ్జీ ప్రభాకర్‌రావుకు స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాలమోన్

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:**
జహీరాబాద్ కోర్టుకు నూతనంగా మంజూరు అయిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాట్లను జిల్లా న్యాయమూర్తి కే ప్రభాకర్‌రావు శనివారం పరిశీలించారు. కోర్టును పరిశీలించేందుకు హాజరైన జిల్లా న్యాయమూర్తిని బార్ అసోసియేసన్ అధ్యక్షులు ఎపిపి సాలమోన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పూల బొకేను అందించి ఘనంగా స్వాగతం పలికారు. కోర్టు ఏర్పాటుకు వెంటనే తగు చర్యలు చేపట్టాలని సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి జి అఉష, న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్ సాగర్, ఉపాధ్యక్షులు మాణిక్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొనసాగుతున్న జాతర ఉత్సవాలు



గడిపెద్దాపూర్‌లో పూజలు అందుకుంటున్న మల్లికార్జున స్వామి

**అల్లాదుర్గం, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామంలో శ్రీ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నట్లు ఆలయ కమిటి బాధ్యులు పేర్కొన్నారు. జాతర ఉత్సవాలను పురష్కరించుకుని గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామి వారిని దర్శించుకని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 7వ తారీఖున స్వామి వారికి అభిషేకం, అర్చన, బోనాలు, శివసత్తుల విన్యాసాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటి బాధ్యులు పేర్కన్నారు. జాతర ఉత్సవాలకు చేరుకునే భక్తుల సౌకర్యార్థం తగు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు.

## డీసీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జనవరి 6, ప్రభాతవార్త:**
మల్కాజ్‌గిరి డీసీపీగా బాధ్యతలు చేపట్టిన పివి.పద్మజారెడ్డిని శనివారం ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి కలిశారు. మల్కాజ్‌గిరి డీసీపీ జానకీ బదిలీ కావడంతో పద్మజారెడ్డి నూతన డీసీపీగా వచ్చి కారా ్యలయంలో బాధ్యతలు స్వీకరించడంతో సీఐ మహేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా వెళ్లి ఆమె పుష్పగుచ్ఛం అందించి పూలమొక్క ఇచ్చారు. పద్మజా రాణి 2010 సంవత్సరంలో మల్కాజ్‌గిరి ఎసిపిగా పనిచేశారని తెలిపారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి, భద్రతలపై చర్చించారు.

## రేపు నిరుద్యోగులకు శిక్షణ..ఎంపికలు: ఎంపిపి

**ఘట్‌కేసర్, జనవరి 6, ప్రభాతవార్త:** ఈనెల 8న ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేందుకు ఎంపికలు నిర్వహిస్తున్నారని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ-హాస్టల్-బోజన వసతితో పాటు ఉద్యోగం కల్పిస్తారని తెలిపారు.

## నేడు డివిజన్‌లో విద్యుత్ కోతలు

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** ఈ నెల 7న నియోజకవర్గ డివిజన్‌లో విద్యుత్ కోతలు ఉంటాయని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలోని న్యాల్‌కల్, రాయికోడ్, ఝురాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదనాన్రు. ఆయా మండలాల్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని అందుకు వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమ వంతు సహకరించాలని అధికారులు వినతి చేశారు.

## కరస్‌గుత్తిలో సప్తాహ భజనలు



కరస్‌గుత్తిలో సప్తహ భజనలు చేస్తున్న భక్తులు

**నాగల్‌గిద్ద, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలంలోని కరస్‌గుత్తి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సప్తహ భజన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రౌండ్ ద క్లాక్‌గా ఆలయంలో భజనలు చేస్తూ కీర్తనలు ఆలపిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సప్తహ భజనలు కనొసాగేలా గ్రామ సర్పంచ్ సంజీవరెడ్డి తన వంతు సహకారం అందచేస్తున్నారు.

## సెయింట్ ఆంథోని కళాశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 6, ప్రభాతవార్త:** ఈ నెల 8వ తారీఖు నుంచి 10వ తేదీ వరకు పట్టణంలోని సెయింట్ ఆంథోని మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు డిఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం కళాశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను పురష్కరించుకుని ఏర్పాట్లను డిఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా 11 కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్లులతో పాటు ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్న సన్నాహక సమావేశాన్ని ఉద్దేశించి డిఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి దాదాపుగా 9వందల వరకు ప్రదర్శనలు రావచ్చని పేర్కన్నారు. ప్రదర్శనలకు అనుగుణంగా ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శనలు ప్రదర్శించే పాఠశాలల వారు సోమవారం ఉదయం 8గంటలకు థీమ్స్ వారీగా రిజిస్ట్రేషన్ ప్రారంభం అవుతుందని, అందుకు తమ సైన్స్ ఎగ్జిబిషన్‌ను తీసుకుని విధిగా రిపోర్టు చేసి కేటాయించిన గదుల్లో తమ ప్రదర్శనలు ప్రదర్శించాల్సి ఉంటుందని జిల్లా సైన్స్ అధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి విజయకుమార్, సిఎంఓ వెంకటేశం, సెయింట్ ఆంథోని కళాశాల యాజమాన్యం సొల్మన్‌రెడ్డి, కరుణాకరరెడ్డి, డిసిఈబి కార్యదర్శి లింబాజీ, మీడియా కన్వీనర్ జాకీర్ హుస్సేన్, ఓవరాల్ కమిటి ఇంచార్జిలు ప్రభాకర్, జగదీశ్వర్, 11 కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్‌లు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, జనవరి 6, ప్రభాతవార్త:** భారతీ నగర్ డివిజన్ పరిధిలో కన్యకా పరమేశ్వరి ఆలయం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి ఆవిష్కరించారు. డివిజన్ పరిధిలోని బొంబాయ్ కాలనీలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి శ్రీ రామాలయం వరకు నిర్వహించిన అయోధ్య అక్షింత వితరణ కార్యక్రమాన్ని పురష్కరించుకుని నిర్వహించిన శోభాయాత్రలో కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. కాలనీలోని ప్రజలకు అయోధ్య అక్షింతలను వతరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటి సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**పాపన్నపేట, జనవరి 6, ప్రభాతవార్త:** మండలంలోని ఏడుపాయల చెక్ డ్యాంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... ఏడుపాయల చెక్ డ్యాంలో వ్యక్తి శవం ఉన్నట్లు సమాచారం అందుకుని సంఘటన స్థలానికి చేరుకుని చెక్‌డ్యాంలో నుంచి శవాన్ని వెలికి తీసి పరిశీలించగా ఎలాంటి ఆధారాలు కానరాలేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తి (30-35 సంవత్సరాలు) శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు పోలీసు ఠాణాకు సమాచారం అందించాలని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి వివరించారు.

